క్లుప్తంగా

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి సీహెచ్ వి.ఎస్ జనార్దన్‌రావు సోమవారం తనిఖీ చేశారు. హెచ్ఎం శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు అయిందో తెలుసుకున్నారు. పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు కృషి చేసి వందశాతం ఉత్తీర్ణత తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

రూ.51,116 విరాళం



విరాళం అందిస్తున్న వెంకటేశ్

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ప్రధాన ఆలయానికి చొప్పదండికి చెందిన మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్,లక్ష్మి దంపతులు రూ.51,116 విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ ట్రస్టు కమిటీ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి సోమవారం విరాళం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి దండె లింగయ్య, కార్యదర్శి దూస రాము, కార్యవర్గ సభ్యులు దూస లక్ష్మీనర్సయ్య, కొత్తపల్లి లక్ష్మణ్ బాబు, అనుమల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



సోదమ్మ వేషధారణలో విద్యార్థినులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట హైస్కూల్ విద్యార్థులకు సోమవారం వివిధ వృత్తులపై అవగాహన కల్పించారు. ఏడో తరగతి విద్యార్థులు సమాజంలోని పలు వృత్తులకు సంబంధించిన వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. చిన్నారుల సోదమ్మ వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ శైలజ, ఉపాధ్యయులు వనిత, వీరుపాల్‌రెడ్డి, సమ్మయ్య, మంజుల, గంగ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కొత్త కైలాసం, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామ ప్రముఖులు కొత్త తిరుపతి, జనవేని అనిల్, ఎస్‌డీ షరీఫ్, కానవేని శివకుమార్, కోల జీవన్, జేరిపోతుల ప్రవీణ్, చీమర్తి మల్లయ్య, రావుల రవీందర్, పత్తేం తిరుపతి, అమ్మఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ విజయలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం

గన్నేరువరం: సమస్యలను పరిష్కరించడంతో విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు, విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో రైతులు, వినియోగదారులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యాన్ని తరలించే క్రమంలో రహదారిపై ఉన్న విద్యుత్ వైర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని సరి చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదని కేంద్రాల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి సోమవారం తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారని, మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సమ్మయ్య, వేల్పుల ఓదెలుపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

వచ్చేది తక్కువ.. చేసేది ఎక్కువ

- ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్న సీఆర్పీలు
- అధిక పని, ఒత్తిడితో సతమతమవుతున్న వైనం
- చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణ భారమంటూ ఆందోళన
- ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్



హన్మకొండలో ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)



కలెక్టరేట్ ఎదుట సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు(ఫైల్)

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు వివిధ సమస్యలతో సతమతమవుతు న్నారు. ఉద్యోగ భద్రత లేక ఆందోళనలో విధులు నిర్వహిస్తున్నారు. చాలీచాలని వేతనంతో నానా అవస్థలు పడుతున్నారు. 2012లో సమగ్రశిక్ష అభియాన్‌లో సీఆర్పీ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా సీఆర్పీలు పని చేస్తున్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తిచేసినా వారికి అందే వేతనం అంతంత మాత్రమే. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెగ్యులర్ ఉపాధ్యాయుల కన్నా ఎక్కువ విధులు నిర్వహిస్తున్నా గత ప్రభుత్వం వారి చాకిరీని గుర్తించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా కనీస వేతనం అందించడంతో పాటు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేస్తుందేమోనని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఏళ్లుగా వెట్టిచాకిరీ

డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 36 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2012లో రూ.5,500 ప్రారంభమైన వేతనం ప్రస్తుతం రూ.19,500 చేరుకుంది. 12 సంవత్సరాల నుంచి విద్యాశాఖలో వెట్టి చాకిరీ చేస్తున్నామని, ప్రస్తుతం ఇస్తున్న వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, రోజు రోజుకూ పని భారం పెరగడంతోపాటు మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రూ.28 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

ఉద్యోగుల విధులు, డిమాండ్లు

బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించాలి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవులపై వెళ్లినపుడు విద్యార్థులకు పాఠాలు బోధించాలి. పాఠశాలలు, కాంప్లెక్స్ పాఠశాలలకు అనుసంధానంగా ఉంటూ మౌలిక వసతులు కల్పించాలి. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సకాలంలో విద్యార్థులకు అందేలా చూడాలి. నెలలో ఒకసారి తప్పనిసరిగా కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలలను సందర్శించి పాఠశాల ముగింపు వరకు ఉండాలి. సందర్శించిన పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. జిల్లాలో 6-14 సంవత్సరాల పిల్లల వివరాలను సేకరించాలి. తన క్లస్టర్ పరిధిలో ఉన్న పాఠశాలలను ప్రతీ రోజు ఒకటి చొప్పున సందర్శించాలి. ఉదయం ప్రార్థన సమయానికి విధిగా అక్కడ ఉండాలి. ఎంత మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు, ఆ తర్వాత తరగతి గదుల్లో అటెండెన్స్ తీసుకోవాలి. మధ్యాహ్న భోజన అమలు, పర్యవేక్షణ, పాఠశాలల పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాలి. వీటితో పాటు అదనంగా బియ్యం, పుస్తకాల పంపిణీ, విద్యార్థులకు ఆధార్‌కార్డు నమోదు చేస్తున్నారు. కనీసం వేతనం రూ.19,500 నుంచి రూ.28 వేలకు పెంచాలి, ఉద్యోగ భద్రత కల్పించి మహిళా సీఆర్‌పీలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి, పాఠశాలలను సందర్శించినప్పుడు టీఏ, డీఏలతో పాటు మొబైల్ ఇంటర్నెట్ చార్జీలను చెల్లించాలి, స్టేషనరీ, జిరాక్స్, రవాణా ఖర్చులకింద ప్రతినెలా రూ.2 వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



సమగ్రశిక్ష కాంట్రాక్టు సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు టైం స్కేల్ వర్తింపజేయాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ.28 వేల కనీస వేతనం చెల్లించడంతో పాటు ఈస్‌ఐ వర్తింపజేయాలి. టీఏ, డీఏలు చెల్లించాలి. గతేడాది హైదరాబాద్‌లో చేసిన ధర్నాకు మద్దతు తెలిపిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలి.

– బాపు మహేందర్, సీఆర్పీ, జమ్మికుంట

హామీ నిలబెట్టుకోవాలి



గతేడాది చేపట్టిన రిలే నిరాహార దీక్ష సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. కేజీబీవీల్లో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఎంఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. విధి నిర్వహణలో మృతిచెందిన వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. చాలీచాలని వేతనంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం న్యాయం చేయాలి.

– గుండ రాజిరెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే, లెక్చరర్లు

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్ అధ్యక్షతన క్రిప్టోగ్రఫీ అండ్ సైబర్ సెక్యూరిటీ పుస్తకావిష్కరణ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కళాశాల సెక్రెటరీ సతీశ్‌కుమార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అధ్యాపకులు పుస్తకాలు రాయడంతో విద్యార్థులకు అదనపు సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి మేజర్ డాక్టర్ కె.రవీంద్రబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎస్.రఘు, ఏఐఎంఎల్ విభాగాధిపతి, డీన్ ఆర్అండ్‌డీ డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● **సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు**

చొప్పదండి: సామాజిక సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, సాంబయ్య దంపతులు మున్సిపాలిటీకి వైకుంఠరథం సమకూర్చగా ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఇప్పనపల్లి శంకరమ్మ జ్ఞాపకార్థం వైకుంఠరథం అందజేశామని విజయలక్ష్మి తెలిపారు.

● **ఎమ్మెల్సీ బల్మూరిని కలిసిన నాయకులు**

జమ్మికుంట: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండీ సలీం, నాయకులు మక్కా దర్శనం చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మక్కా నుంచి తీసుకువచ్చిన ప్రసాదం అందజేశారు.

● **గ్రామస్తుల ఆర్థికసాయం**

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన ఒజ్జ వెంకటేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య కోమల, ఇద్దరు పిల్లలు. ఆ నిరుపేద కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. మృతుని దహన సంస్కారాలకు ఆర్థికసాయ చేయడంతోపాటు వెంకటేశ్ కూతురు పేరుమీద రూ.1.20 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పత్రాలను సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

● **ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ కమిటీ**

హుజూరాబాద్: పట్టణంలోని సాయిరూప ఫంక్షన్ హాల్‌లో సోమవారం హుజూరాబాద్ ఇన్‌చార్జి తుంగ ఆంజనేయులు అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఇమ్మడి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా శనిగరపు కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కొమ్ము సిద్ధు, కార్యదర్శిగా రొంటాల సిద్ధుకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

● **కూరగాయల అంగడి ప్రారంభం**

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామంలో కూరగాయల సంత (అంగడి)ను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నసదానందం సోమవారం సాయంత్రం పునఃప్రారంభించారు.

● **విద్యార్థినికి అభినందనలు**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థిని నబామహ్మద్ జపాన్ పర్యటనకు వెళ్లిరావడంతో సోమవారం అధ్యాపకులు అభినందించారు.

● **ఉచిత గుండె వైద్య శిబిరం**

మానకొండూర్: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కొండపల్కలలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ముదిరాజ్ కుల సంఘం నాయకులు ప్రారంభించారు. డాక్టర్ హర్షిత్ వైద్య పరీక్షలు చేశారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవ అందించాలనే లక్ష్యంలో శిబిరం నిర్వహించామన్నారు.

● **కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు**

హుజూరాబాద్: కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలే తప్పా లాభాలు లేవని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చకుండానే ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

● **జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక**

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ విద్యార్థి హరీశ్ అండర్-19 విభాగంలో ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరీశ్ ఇటీవల సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో సత్తాచాటాడు. డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ మొయిజ్ బేగ్ తెలిపారు.

● **కాంగ్రెస్ నాయకుల ర్యాలీ**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. హుజూరాబాద్ వ్యవసాయమార్కెట్ వైస్ చైర్మన్‌గా నాంపల్లి తిరుపతి, డైరెక్టర్‌గా తనుకు ప్రభాకర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెళ్తూ అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు.

● **ప్రజావాణిలో ఫిర్యాదు**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో ఖబ్రస్తాన్ భూమిని కాపాడాలని జమా మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ. జహిరొద్దీన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

● **విద్యుత్ సరఫరా నిలిపివేత**

గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లె గ్రామంలో గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

● **నేడు మండలస్థాయి సమావేశం**

చిగురుమామిడి: ఎమ్మార్పీఎస్ చిగురుమామిడి ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా నాయకుడు కాత మల్లయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం చిగురుమామిడిలో మాట్లాడారు.

● **వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పీడీ రాజ్‌కుమార్ వాలీబాల్ అందించారు. అనంతరం పీడీని విద్యార్థులు సన్మానం చేశారు.

● **వివరాలు నమోదు చేసుకోవాలి**

చొప్పదండి: సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరూ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు.

సన్మానం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డిని మండల యువజన కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తిరుపతిరెడ్డి ఎన్నికపట్ల హర్షం వ్యక్తంచేస్తూ సోమవారం స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తీసుకొచ్చి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నాయకులు కాంతాల మహిపాల్‌రెడ్డి, వి. సంతోష్‌కుమార్, బోయిని వేణుగోపాల్, జిల్లెల్ల రమేశ్, జి. రఘుబాబు, వి. సంతోష్‌రెడ్డి, వడియాల సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

హుజూరాబాద్: దివంగత టీడీపీ సీనియర్ నాయకుడు గుర్రం వెంకటేశ్వర్ల కుటుంబ సభ్యులను సోమవారం బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. వెంకటేశ్వర్లతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి 'పొన్నం'



ఏఈవోతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

శంకరపట్నం: మండంలంలోని తాడికల్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఎంత తూకం వేస్తున్నారని సెంటర్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగారు. ఎంత మందికి రుణమాఫీ కాలేదని ఏఈవో లక్ష్మీప్రసూనను మంత్రి ప్రశ్నించగా సుమారు 200 మందికి మాఫీ కాలేదని మంత్రికి తెలిపారు. రేషన్‌కార్డు, ఇతర సాంకేతిక సమస్యలతో మాఫీ కాలేదని, త్వరలోనే మాఫీ చేస్తామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసాపై నిర్ణయం తీసుకుని యాసంగికి రైతు భరోసా అందిస్తామన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ భాస్కర్, మండల అధ్యక్షుడు బస్వయ్య, వైస్ చైర్మన్ తిరుపతి, సీఈవో వీరస్వామి, మాజీ సర్పంచులు గట్టు తిరుపతి, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గంగాధర: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్ మాజీ సర్పంచ్ వేముల లావణ్యఅంజి, మాజీ వార్డు సభ్యులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఆయా పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెలిచాల తిర్మల్‌రావు, పురమల్ల మనోహర్, వేముల భాస్కర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, అట్ల శేఖర్‌రెడ్డి, తోట సంధ్య, పడితపల్లి కిషన్, కోల ప్రభాకర్, దాతు అంజి, పెంచాల చందు, గవాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో...

మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో సోమవారం నిర్వహించిన పోచమ్మ దేవాలయంలో (శీతలదేవి) విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. సంస్కృతి సాంప్రదాయాలకు దేవాలయాలు నిలయమని, నియోజకవర్గంలో దేవాలయాల నిర్మాణాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు.

గండి పూడ్చిన రైతులు



ట్రాక్టర్‌తో మట్టి పోస్తున్న రైతులు

శంకరపట్నం: మండలంలోని కల్వల ప్రాజెక్ట్ మత్తడి వద్ద పడిన గండిని వీణవంక రైతులు పూడ్చుతున్నారు. వానాకాలంలో గండి పడగా నీరంతా దిగువకు వెళ్లిపోయింది. ముత్తారం చెరువు మత్తడి నుంచి కల్వల ప్రాజెక్ట్‌లోకి నీరు వస్తుండగా యాసంగిలో కల్వల రైతులతో పాటు వీణవంక మండలానికి చెందిన వరినాట్లు వేసేందుకు సొంత డబ్బులతో గండిని జేసీబీ, ట్రాక్టర్లతో మట్టిని తరలించి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. ఎన్నికలప్పుడే రాజకీయనాయకులు వస్తున్నారని, ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శాశ్వత పనులు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

కేజీబీవీలో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్యారాణి, సిబ్బంది

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కేజీబీవీలో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 39 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. జ్వర పీడితులకు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, రక్తహీనత వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం సరళ, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సుప్రియ, టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుకాలేదు

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయలేక పోయిందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి మాట్లాడారు. కరీంనగర్ జిల్లాకు విజయాల చరిత్ర ఉందని, తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ కరీంనగర్ నుంచే ప్రారంభించారని, 29న జరిగే దీక్ష దివాస్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రజలు తరలిరావాలని, కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఎలాంటి పథకాలు అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడుమాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఇల్లంతకుంట మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు, మాజీ సర్పంచ్ దేవ సతీశ్‌రెడ్డి, పిట్టల మధు తదితరులు పాల్గొన్నారు.

టెడ్ ఎడ్ సెలక్షన్ టెస్ట్



గంగాధర: పరీక్ష నిర్వాహకులతో విద్యార్థులు

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పారమిత హైస్కూల్ సౌజన్యంతో మండల స్థాయి టెడ్ఎడ్ (టెక్నాలజీ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ డిజైన్ ఎడ్యూకేషన్) సెలక్షన్ టెస్ట్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు నెలరోజుల పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తెలిపారు. పరీక్షలో గంగాధర, గర్షకుర్తి ఉన్నత పాఠశాలతో పాటు మోడల్‌స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పారమిత టీచర్లు సునందకుమారి పాత్రో, విజయస్వాతి స్థానిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టెడ్ఎడ్ సెలక్షన్ టెస్ట్‌లో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కన్నాపూర్ జిల్లా పరిషత్‌కు చెందిన ఇద్దరు, కేజీబీవీకి చెందిన ఓ విద్యార్థిని ఎంపికయ్యారు. కాంపిటీషన్‌ను డీఈవో జనార్దన్‌రావు పరిశీలించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు పారామిత పాఠశాలలో శిక్షణ ఇస్తారని ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

ముందస్తు క్రిస్మస్



కేక్ కట్ చేస్తున్న చర్చి పాస్టర్ నెల్సన్

హుజూరాబాద్: మండలంలోని రంగాపూర్ గ్రామం కల్వరి చర్చిలో ఆదివారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ డాక్టర్ నెల్సన్ దైవ సందేశం వినిపించారు. దేవుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, శాంతితోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.